క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

పెదకాకాని: విద్యుత్ లేన్ల మరమ్మతుల సందర్భంగా సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పెదకాకాని ఏఈ బత్తుల శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెదకాకాని మండలం అగతవరప్పాడు ఏపీఎస్ కాలనీ, ఇన్నర్‌రింగ్ రోడ్డు, సాయినగర్, వెనిగండ్ల సుందరయ్యకాలనీ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. లేన్ల మరమ్మతుల సందర్భంగా గురువారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ సరఫరాలో ఏర్పడిన అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

విజ్ఞాన్‌లో ఉచిత వైద్య శిబిరం



గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ వి అనురాధ అన్నారు. పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన జెమిలి డెంటల్ కేర్ సహకారంతో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. అనంతరం డాక్టర్ నారాయణ్, డాక్టర్ జమిలి, డాక్టర్ హర్షిత జమిలి, డాక్టర్ గుమ్మడి గౌతమ్‌లు 400 మంది విద్యార్థులకు ఉచితంగా దంత, తదితర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అంకమ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



గుంటూరురూరల్: అప్పుల బాధ భరించలేక వ్యక్తి అదృశ్యమైన ఘటనపై నల్లపాడు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం నల్లపాడు గ్రామానికి చెందిన బుచ్చినబోయిన వెంకటేశ్వరరావు బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో తండ్రి పిచ్చయ్య బంధువులను, కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోయింది. నల్లపాడు పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

12న బీపీ మండల్ విగ్రహావిష్కరణ

నెహ్రూనగర్: ఓబీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ విగ్రహావిష్కరణను ఈ నెల 12న గుంటూరులో నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ మండల్ సిఫార్సుల్ని అమలు చేయాలని డిమాండ్‌తో ఈ నెల 10న మంగళగిరిలో బీపీ మండల్ -2 ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు. సంఘ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా గుంటూరులో బీపీ మండల్ విగ్రహావిష్కరణ జరుపుకోవడం బీసీలకు గర్వకారణమని తెలిపారు. సమావేశంలో సంఘ నాయకులు డాక్టర్ శేషయ్య, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, పావులూరి హనుమంతురావు, కన్నా మాస్టారు, తన్నీరు ఆంజనేయులు, కోలా అశోక్, నాయకులు పాల్గొన్నారు.

పదవీ విరమణ వయోపరిమితి పెంపుపై హర్షం

ఏఎన్‌యూ: యూనివర్సిటీల్లో బోధనేతర సిబ్బంది పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నందుకు ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాల బోధనేతర సంఘం అధ్యక్షుడు వై. వెంకటప్పారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు ఆయన తెలిపారు. అడగగానే పదవీ విరమణ వయస్సు పెంచమని అధికారులకు ఆదేశాలిచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పదవీ విరమణ వయస్సు పెంచడానికి సహాయ, సహకారాలు అందించిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

గుంటూరు లీగల్: ఏసీ కాలేజీ లా చివరి సంవత్సరం విద్యార్థులు బుధవారం జిల్లా వినియోగదారుల కమిషన్‌ను సందర్శించారు. వినియోగదారుల హక్కులు, విధులపై కమిషన్ అధ్యక్షురాలు టి.సునీత, సభ్యులు కె.విజయలక్ష్మి, గుంటకల పున్నారెడ్డితో మాట్లాడి, తమ సందేహాల్ని నివృత్తి చేసుకున్నారు. వినియోగదారుల కమిషన్ అధికారాల్ని తెలుసుకున్నారు. ఏసీ కాలేజీ స్టాఫ్ జి.కిరణ్, బత్తుల డేనియల్, సీనియర్ న్యాయవాది, కాలేజీ లెక్చరర్ డాక్టర్ బుర్రా మాణిక్యారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం కోరే ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్
- ముగిసిన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, చిత్రంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తదితరులు

పెదకాకాని: పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోరే వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. పెదకాకాని మండలం పెదకాకాని, కొప్పురావూరు, వెనిగండ్ల, అగతవరప్పాడు గ్రామాలకు చెందిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు వెనిగండ్ల మైత్రి కల్యాణ మండపంలోనూ, నంబూరు గ్రామ కల్యాణ మండపంలో నంబూరు, ఉప్పలపాడు, తక్కెళ్లపాడు, రామచంద్రపాలెం, వెంకటకృష్ణాపురం, తంగెళ్లమూడి, అనుమర్లపూడి గ్రామాలకు చెందిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు సమావేశం నిర్వహించారు. డొక్కా మాట్లాడుతూ ప్రభుత్వం నియమించిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు బాధ్యతగా విధులు నిర్వర్తించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలన్నారు. ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తీసుకు వెళ్లి ఆ కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి, బ్యాంకు ఖాతాకు జమ చేయబడిన నగదు వంటి వివరాలు తెలియజేస్తూ అవగాహన కల్పించాలన్నారు. స్థానిక నేతలతో కలసి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకే కన్వీనర్లు, గృహసారథులను ఎంపిక చేశామని అన్నారు. కన్వీనర్లు, గృహసారథులకు ఉచిత బీమా పథకం ఏర్పాటు చేయడంతో పాటు పార్టీ కార్యక్రమాలలో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం మూడున్నర ఏళ్లలోనే అన్ని హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్రాభివృద్ధి దృష్ట్యా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. అర్హతే ఆధారంగా పార్టీలకు, గ్రూపులకు, వర్గాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు సంక్షేమ పథకాల లబ్ధి పొందుతున్నారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలతో గద్దెనెక్కి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో 87 శాతం మంది ప్రజలు సంక్షేమ పథకాల ఫలాలను అనుభవిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులంతా ఐకమత్యంతో సమష్టిగా పనిచేసి విజయఢంకా మోగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, మండల కన్వీనర్ చాగంటి మురళీమోహన్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, స్థానిక నాయకులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు

ఆర్టీసీ పొన్నూరు డిపో మేనేజర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న డిపో మేనేజర్ శ్రీనివాస్

పొన్నూరు(చేబ్రోలు): మహాశివరాత్రి సందర్భంగా యాత్రికులు, భక్తుల అవసరాల నిమిత్తం ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు ఆర్టీసీ పొన్నూరు డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో యూనియన్ నాయకులు, గ్యారేజీ సిబ్బంది, సూపర్‌వైజర్‌లతో బుధవారం సమావేశం నిర్వహించారు. డీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ పొన్నూరు నుంచి శ్రీశైలం మల్లికార్జునస్వామి దేవస్థానానికి ఐదు ప్రత్యేక బస్సులు, పొన్నూరు నుంచి గోవాడ బాల కోటేశ్వరస్వామి దేవస్థానానికి ఎనిమిది బస్సులు నడపటానికి నిర్ణయించినట్లు తెలిపారు. బాలకోటేశ్వరస్వామిని దర్శించుకునే భక్తులకు ఆర్టీసీ అధికారులు అదనపు చార్జీలు లేకుండా పాత చార్జీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎన్ఎంయూ నాయకులు ఏఏ బేగ్, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



చేబ్రోలులో జిల్లా మహాసభ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేబ్రోలు: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న యూటీఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వరరావు కోరారు. చేబ్రోలులోని కార్యాలయం వద్ద ఆహ్వాన పత్రికలను బుధవారం ఆవిష్కరించారు. గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో ఫిబ్రవరి 11వ తేదీన జరిగే యూటీఎఫ్ జిల్లా మహాసభలకు చేబ్రోలు మండలం నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ తదితరులు విద్యారంగంలో ప్రవేశపెడుతున్న సంస్కరణలు, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వై రమేష్‌బాబు, డి నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, విజయరాజు, ఎల్ఏ రమణరావు, అంకమ్మరావు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు వేగవంతం చేయండి



ఈ క్రాప్ నమోదు వివరాలను పరిశీలిస్తున్న పొన్నూరు ఏడీఏ తిరుమలాదేవి

కాకుమాను: మండలంలోని గ్రామాలలో ఈ ఏడాది రెండో పంట సాగు చేస్తున్న ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేసుకునే విధంగా వ్యవసాయ సిబ్బంది కృషి చేయాలని పొన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్.తిరుమలాదేవి సూచించారు. మండలంలోని కాకుమాను, కొండపాటూరు గ్రామాలలోని పంట పొలాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ ఈ ఏడాది రెండో పంట సాగు చేస్తున్న మండలంలోని రైతులను గుర్తించి వారికి ఈ క్రాప్ నమోదు చేయాలని అన్నారు. ఈనెల 20వ తేదీలోపు ఈ క్రాప్ నమోదును పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను పరిశీలించి అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణ యజమానులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో కె.కిరణ్మయి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శారదా పరమేశ్వరి ప్రతిష్ట మహోత్సవాలు



వీణా నాదార్చన చేస్తున్న భారతీదేవి శిష్య బృందం

పాత గుంటూరు: సంపత్ నగర్‌లో శ్రీ శారదా పరమేశ్వరి అమ్మవారి ప్రతిష్ట మహోత్సవాల్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. లలితా సహస్రనామ హోమం భక్తిశ్రద్ధలతో జరిపారు. శ్రీ భారతి సంగీత నిలయం వ్యవస్థాపకులు, ప్రముఖ వీణా విద్వాంసురాలు ఏ. భారతీదేవి శిష్య బృందం పంచ వీణలతో అమ్మవారిని నాదార్చనతో సేవించారు. శ్రీ త్యాగరాజస్వామి కృతులు, అన్నమయ్య సంకీర్తనలు, అనేక వాగ్గేయకార సంకీర్తనల్ని ఆలపించారు. వీరికి మృదంగంపై సూర్య వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కళాకారుల్ని ఘనంగా సత్కరించారు.

ప్రతి ఇంటికీ సురక్షిత నీరు అందించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శరత్‌బాబు

కాకుమాను: మండలంలోని గ్రామాలలోని ప్రతి ఇంటికీ సురక్షితమైన నీరు అందించడమే లక్ష్యంగా ప్రతి పంచాయతీ కార్యదర్శి పనిచేయాలని ఎంపీడీఓ డి.శరత్‌బాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జలజీవన్ మిషన్ పథకంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ దేశంలో గ్రామాలలో ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేసి రోజుకు ప్రతి ఇంటికి 55 లీటర్ల తాగునీరు అందించడమే జల జీవన్ మిషన్ ముఖ్యోద్దేశమని తెలిపారు. జల జీవన్ ప్రాజెక్టు మేనేజర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 2024 నాటికి దేశంలో ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి పంచాయతీ కార్యదర్శి ఆయా గ్రామాలలో తాగునీరు కుళాయిలు లేని వారిని గుర్తించి వారికి కుళాయిలను ఏర్పాటు చేయాలని అన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి



రోడ్డు ప్రమాదంలో మరణించిన పెండ్యాల శివపార్వతి(58)

పెదకాకాని: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందిన సంఘటన పెదకాకానిలో చోటుచేసుకుంది. పెదకాకాని గ్రామానికి చెందిన పెండ్యాల శివపార్వతి ఈనెల 6వ తేదీన మండల పరిధిలోని తక్కెళ్లపాడులోని పుట్టింటికి వెళ్లింది. అదేరోజు సాయంత్రం తన మేనల్లుడు బైక్‌పై ఇంటికి తిరుగు ప్రయాణమైంది. వారు ప్రయాణిస్తున్న బైక్ పెదకాకాని బస్టాండ్ సమీపంలోకి చేరుకునే సరికి ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన ఆటో ఢీ కొంది. ఈ ఘటనలో బైక్ అదుపు తప్పి బైక్‌పై కూర్చుని ఉన్న పెండ్యాల శివపార్వతి కింద పడింది. తల రోడ్డుకు తగలడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. స్థానికుల సహకారంతో గడ్డిపాడు సమీపంలోని ఉదయ్ ఆసుపత్రికి తరలించారు. బ్రెయిన్‌కు దెబ్బ తగలడంతో అదే రోజు సర్జరీ కూడా చేశారు. పరిస్థితి విషమించి బుధవారం ఉదయం మృతి చెందింది. మృతురాలికి భర్త పెండ్యాల ప్రతాప్, కుమారుడు నాగసురేష్, కుమార్తె నాగసుధ ఉన్నారు.

హరికథా భాగవతార్ కోట సచ్చిదానందశాస్త్రికి సన్మానం



సచ్చిదానందశాస్త్రిని సన్మానిస్తున్న మస్తానయ్య, శివరామకృష్ణ తదితరులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై బుధవారం శ్రీ త్యాగరాయ స్వరభారతి సంగీత కళాశాల వార్షికోత్సవం, శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం, వైణిక విద్వాన్ శ్రీమాన్ కొమండూరి తిరుమలాచార్యులు వర్ధంతిని నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు కొమండూరి వెంకట అనంత శైనం ఆధ్వర్యంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత బ్రహ్మశ్రీ కోట సచ్చిదానందశాస్త్రి భాగవతార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ధూళిపాళ్ల శివరామకృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, విశ్రాంత ఏఈ దెందుకూరి శ్రీరామమూర్తి పాల్గొన్నారు. మస్తానయ్య మాట్లాడుతూ హరికథా రంగంలో కోట సచ్చిదానందశాస్త్రి కృషి చిరస్మరణీయమని, ఆయనకు పద్మశ్రీ పురస్కారం లభించడం అభినందనీయమని తెలిపారు. అనంతరం సంగీత కచేరీలో గాయకులు పలు కీర్తనలు ఆలపించి అలరించారు.

జగనన్న కాలనీల్లో ఉగాది నాటికి గృహ ప్రవేశాలు

నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: జగనన్న కాలనీల్లో ఉగాది నాటికి గృహ ప్రవేశాలు జరిగేలా ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఇంజినీరింగ్, హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, నగరంలో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉగాది నాటికి ప్రతి లే అవుట్‌లో గృహ ప్రవేశాలు జరిగేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని చెప్పారు. కాలనీల్లో ఇళ్ల నిర్మాణ కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్లకు అందించే ఇనుము పంపిణీలో లోపాలు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. విచారణ చేసి సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని హౌసింగ్ ఎండీకి లేఖ రాస్తామని స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి అయ్యేలా చూడాలని, ఇందులో ఎటువంటి అవినీతికి పాల్పడినా పోలీసు కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. లే అవుట్‌లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తున్నామని, లబ్దిదారులు ఇళ్ల నిర్మాణం చేసుకునేలా సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె చెప్పారు. అనంతరం నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మాట్లాడారు. 15 ఫైనాన్స్ కమిషన్ నిధులతో చేపట్టిన పనులకు వెంటనే సీఎఫ్ఎంఎస్‌లో బిల్లులు అప్ లోడ్ చేయాలని ఆదేశించారు. స్వచ్ఛ సర్వేక్షణ్– 2023లో భాగంగా నగరంలోని పబ్లిక్ టాయ్‌లెట్స్ మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని ఏఈలను ఆదేశించారు. నగరంలో ట్రాఫిక్ ఐలాండ్స్ పనులు, నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్ పనులు ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని చెప్పారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయిన ప్రాంతాల్లో డ్రెయిన్ల నిర్మాణం వేగంగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, హౌసింగ్ పీడీ సాయినాథ్‌కుమార్, ఈఈ శంకరరావు, నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కర్, ఈఈలు సుందర్రామిరెడ్డి, శాంతిరాజు, కొండారెడ్డి, కోటేశ్వరరావు, హౌసింగ్, నగరపాలక సంస్థ డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

జిల్లా జడ్జిగా మంచి తీర్పులు ఇవ్వాలి



సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీదేవి

గుంటూరు లీగల్: జిల్లా జడ్జిగా శ్రీదేవి మంచి తీర్పులు ఇచ్చి హైకోర్టు వరకు వెళ్లాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ మధుసూదనరావు అన్నారు. గుంటూరు ఆరో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేస్తున్న శ్రీదేవి తెలంగాణ రాష్ట్రంలో జిల్లా జడ్జిగా ఇటీవల ఎంపికైయ్యారు. త్వరలో బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో మంగళవారం ఓ హోటల్‌లో జిల్లాలోని కేడర్, టెన్యూర్ ఏపీపీల ఆధ్వర్యంలో ఆమెకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మధుసూదనరావు మాట్లాడుతూ మహిళా న్యాయవాదులు శ్రీదేవిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నక్కా శారదా మణి, బార్ కౌన్సిల్ సభ్యుడు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, ప్రాసిక్యూటర్లు చారుమతి, స్వర్ణలత భాను, లక్ష్మీరామ్ నాయక్, శౌరీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీదేవి, ఆమె భర్త డీఎస్పీ రవిచంద్రను ఘనంగా సన్మానించారు. తెనాలి సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్ కుమార్ స్వాగతం పలుకగా, చిలకలూరిపేట ఏపీపీ అల్లంశెట్టి పవన్ వందన సమర్పణ చేశారు.

రంజాన్‌లోగా లాలాపేట పెద్ద మసీదు అభివృద్ధి

ముతవల్లీలకు డీఆర్వో చంద్రశేఖర్ ఆదేశం



మసీదును పరిశీలిస్తున్న డీఆర్వో చంద్రశేఖర్

లక్ష్మీపురం(గుంటూరు): చారిత్రత్మక లాలాపేట మసీదు అభివృద్ధి ముతవల్లీలు బాధ్యత వహించాలని, రానున్న రంజాన్ లోగా అన్ని సదుపాయాలు కల్పించాలని ముతవల్లీలను డీఆర్వో చంద్రశేఖర్ ఆదేశించారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఆయన ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ సాంబశివరావు, గుంటూరు జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ముక్తార్ బాషా బుధవారం మసీదు ముతవల్లీలు, మత పెద్దల సమక్షంలో సందర్శించారు. డీఆర్వో మాట్లాడుతూ మసీదుకు వచ్చే ఆదాయంతో అభివృద్ధి చేయాలని ముతవల్లీలకు సూచించారు. మసీదు పైభాగంలో ఉన్న మీనార్ శిథిలావస్థకు చేరిందని, దాన్ని తక్షణమే మరమ్మతులు చేయించాలని చెప్పారు. రంజాన్ మాసం సమీపిస్తున్న తరుణంలో నమాజ్‌కు వచ్చే వారి కోసం మరుగు దొడ్లు, విద్యుత్ వసతి, వజూఖానాలతో పాటు మసీదులో ఎయిర్ కండీషనర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ కోత సమయంలో ప్రత్యామ్నాయంగా సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు.

విద్యా ప్రణాళికలో క్రీడలు అంతర్భాగం కావాలి



విజేతలతో కృష్ణప్రసాద్, రథినీ చౌదరి, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యా ప్రణాళికలో క్రీడలు అంతర్భాగం కావాలని కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కె. కృష్ణప్రసాద్ తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని స్కూల్లో బుధవారం 37వ వార్షిక క్రీడల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఉత్సాహంతో పాటు శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదం చేస్తాయని తెలిపారు. క్రీడల నిర్వహణ కోసం పాఠశాలలో విశాలమైన ప్రాంగణాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రిన్సిపాల్ వై.రథినీచౌదరి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఐకమత్యాన్ని పెంచడంలో క్రీడలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యార్థుల్ని నాలుగు హౌస్‌లుగా విభజించి, నిర్వహించిన పోటీల్లో ఆకాశ్, పృథ్వీ, అగ్ని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్, పాఠశాల వ్యవస్థాపకుడు కె. బసవపున్నయ్య, ఏవో కె. వెంకట్రావు విద్యార్థుల్ని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు

మంగళగిరి: నగర పరిధి ఆత్మకూరు గణపతినగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధి శాలివాహన నగర్ అంగన్ వాడీ కేంద్రంలో జిల్లా ఆర్‌బీఎస్‌కే ఆదేశాల మేరకు హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ పి.అనూష బాల, బాలికలకు ఎత్తు, బరువు, రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఐరన్ సిరప్‌లు అందజేశారు.

రాజకీయ చైతన్యంతోనే అధికారం సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న పరంజ్యోతి

నెహ్రూనగర్: బహుజనులు రాజకీయ చైతన్యవంతమైనప్పుడే అధికారం సాధ్యమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బి. పరంజ్యోతి పిలుపునిచ్చారు. బహుజనుల అభ్యున్నతికి ఏకైక ప్రత్యామ్నాయ పార్టీ బీఎస్పీనే అని పేర్కొన్నారు. బహుజనుల రాజకీయ చైతన్యం కోసం బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బహుజన రాజ్యాధికార చైతన్య యాత్ర కార్యక్రమాన్ని బుధవారం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అగ్రకులాల పార్టీల మధ్యనే అధికారి మార్పిడి జరుగుతోందని ఆరోపించారు. అగ్రకులాల రాజ్యాధికారంలో బహుజనులు అభివృద్ధికి దూరమయ్యారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో బీసీలకు వంద సీట్లు కేటాయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొంతా నాగేశ్వరరావు, నాయకులు కిశోర్, ఎం. బాలయ్య, మల్లికల్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికల ఆవిష్కరణ

మంగళగిరి: నగరంలో వేంచేసియున్న గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రిలను బుధవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిలతో కలసి ఆవిష్కరించారు. బుధవారం నగరంలోని పెదకోనేరు అభివృద్ధి పనులను పరిశీలించేందుకు విచ్చేసిన వారిని దేవస్థాన ప్రతినిధులు కలసి ఆహ్వానపత్రికలను ఆవిష్కరింపజేశారు. ఈ నెల 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 10వ తేదీ ఉదయం 8గంటలకు స్వామి వార్లను, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేయనున్నారు. అదే రోజు రాత్రి 7 గంటలకు గ్రామోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 19వ తేదీ ఉదయం 8 గంటలకు నంది వాహనంపై ఊరేగింపు నిర్వహించి మధ్యాహ్నం 12 గంటలకు బ్రాహ్మణ సమారాధన సాయంత్రం 4 గంటలకు స్వామి వారి దివ్య రథోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

